

నేర్చుకుందాం రండి
మార్కాపురం పట్టణంలోని కోడిరామ్మూర్తి నట శిక్షణ సంస్థ విద్యార్థులకు వివిధ క్రీడలు, ఇతర విభాగాల్లో శిక్షణ ఇస్తోంది. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. - 8లో..



శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం
ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
42/31

వాతావరణం
ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మార్కుల జాబితాలో తప్పులుంటే స్పందించాలి

ఒంగోలు: పదో తరగతి మార్కుల జాబితా (2023–24 సంవత్సరం) లో ఏవైనా తప్పులు దొర్లి ఉంటే విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు తక్షణమే సంప్రదించాలని డీఈవో డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్, విజయవాడ కార్యాలయంలోని జి.మాణిక్యాంబ సెల్:9949510766 ను సంప్రదించాలన్నారు.

ఏకేయూలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో యూజీసీ–నెట్/యూజీసీ–సీఎస్ఐఆర్–నెట్/గేట్/సీడ్, ఇటువంటి జాతీయ స్థాయి పరీక్షల్లో స్కాలర్‌షిప్/ఫెలోషిప్ అర్హత పొందిన విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి పీహెచ్‌డీలో ప్రవేశాలకు కేవలం ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశం పొందేందుకు జూన్ 4వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జి.సోమశేఖర బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏకేయూప్రకాశం.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, లేదా మొబైల్ నంబర్ 8341935856ను సంప్రదించాలన్నారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ.323

కొండపి (సింగరాయకొండ): కొండపి స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో పొగాకు అత్యధిక ధర కేజీ రూ.323 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. వ్యాపారులు అక్కచెరువుపాలెం, గోగినేనివారిపాలెం, పైడిపాడు గ్రామాలకు చెందిన రైతులు 961 బేళ్లు తీసుకురాగా 878 బేళ్లు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 83 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.323, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.267.55. వేలంలో 24 మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు నిర్వహించిన వేలంలో బుధవారం అత్యధిక ధర రైతులకు దక్కిందన్నారు.

భైరవకోన ఆలయ దుకాణాల వేలానికి రూ.20.68 లక్షలు



భైరవకోనలో దుకాణాలకు వేలం నిర్వహిస్తున్న ఈఓ, చైర్మన్

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం, పుణ్యక్షేత్రం భైరవకోనలో 4 రకాల దుకాణాల నిర్వహణకు బుధవారం వేలం నిర్వహించగా ఆలయానికి రూ.20.68 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ నర్రా నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ సిద్దు రమణారెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయం వద్ద నిర్వహించిన వేలంలో వాహన పార్కింగ్ రుసుము వసూళ్ల హక్కు కోసం రూ.8.10 లక్షలు, కొబ్బరికాయలు, ఇతర పూజా సామగ్రి అమ్ముకునే హక్కు కోసం రూ.9.58 లక్షలు, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ విక్రయించే దుకాణాల హక్కు కోసం రూ.2 లక్షలు, తలనీలాలు పోగుచేసుకునే హక్కు కోసం రూ.లక్ష మొత్తం రూ.20.68 లక్షలు ఆదాయం కాగా గత ఏడాది కంటే రూ.2.70 లక్షలు అదనపు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వేలంలో హక్కు పొందినవారు వచ్చే జూన్ 01వ తేదీ నుంచి 2025 మే నెల 31వ తేదీ దాకా దుకాణాలు నిర్వహించుకునే అవకాశం ఉంటుందన్నారు. మరికొన్ని రకాల వస్తువుల విక్రయ దుకాణాల కోసం త్వరలో వేలం నిర్వహిస్తామని ఈఓ, చైర్మన్‌లు తెలిపారు. కార్యక్రమంలో బసిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


పీసీపల్లి పీఎస్‌కు ఎస్పీ ప్రశంస



ప్రశంసపత్రాలు అందుకుంటున్న సిబ్బంది

పీసీపల్లి: ఇటీవల జరిగిన ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బందికి ప్రకాశం జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ బుధవారం ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కనిగిరి పవిత్ర కన్వెన్షన్‌లో కౌంటింగ్ సిబ్బంది, పొలిటికల్ లీడర్స్‌తో ఎస్పీ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించిన పోలీస్ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. అందులో భాగంగా పీసీపల్లి పీఎస్ సిబ్బంది ఎం.రామచంద్రారెడ్డి, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌కు ప్రశంసపత్రాలు అందజేసి ఇదేవిధంగా కౌంటింగ్ విధులు సమర్థంగా నిర్వహించాలని సూచించారు.

అయ్యో బాబోయ్..



రోహిణి కార్తె ప్రభావం..జిల్లాలో ఎండలు అల్లాడిస్తున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచే భానుడు ప్రతాపాన్ని చూపుతున్నాడు. రెండు రోజులుగా జిల్లాలో 45 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. వామ్మో ఇవేం ఎండలంటూ జనం బెంబేలెత్తుతున్నారు. ఒక వైపు వేడిగాలులు.. మరో వైపు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరో వారం రోజులపాటు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

- నిప్పులు చిమ్ముతున్న సూరీడు
- రోహిణికార్తె ప్రభావంతో ఠారెత్తిస్తున్న ఎండలు
- వేడి సెగలు, ఉక్కపోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి
- ఉదయం 7 గంటల నుంచే సెగలు
- జిల్లాలో 41 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు

ఒంగోలు అర్బన్: జిల్లాలో రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగిపోయాయి. ఎండవేడి, ఉక్కపోతతో పాటు ఊపిరి ఆడని విధంగా వాతావరణం మారిపోయింది. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లాలో 41 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో నిప్పుల కొలిమిలా మారింది. జనం బయటకు రాకపోవడంతో ఉదయం 11 గంటల నుంచే రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లా కేంద్రం ఒంగోలులో మంగళవారం 44 డిగ్రీలు, బుధవారం 43 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. అత్యల్ప ఉష్ణోగ్రతలు సైతం 32 డిగ్రీల పైనే ఉండడంతో వాతావరణం వేడిగా మారుతోంది. రాత్రి పది గంటలకు సైతం వేడిగాలులు వీస్తుండడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. మార్కాపురంలో బుధవారం అత్యధికంగా 42 డిగ్రీలు నమోదు కాగా దర్శి, కనిగిరి, బేస్తవారిపేట, యర్రగొండపాలెం, సింగరాయకొండ, చీమకుర్తిల్లో 41 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 7 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. పైగా వేడి గాలులు వీస్తుండటంతో వడదెబ్బ తగిలే ప్రమాదం పొంచి ఉంది. అత్యవసర పనులకు సైతం బయటకు తిరగాలంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో వారం పాటు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు వేడి గాలులు వీస్తాయని సంబంధిత అధికారులు తెలిపారు.

పెరిగిన ఎండలు, వేడి గాలుల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రావడం మంచిది కాదని అటు అధికార యంత్రాంగం, వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉదయం 11 గంటల లోపు పనులు చూసుకుని ఎండ తీవ్రత తగ్గిన తర్వాత సాయంత్రం సమయంలో మాత్రమే బయటకు రావాలని సూచిస్తున్నారు. ఒక వేళ అవసరం రీత్యా బయటకు వచ్చినా తాగునీరు, ఓఆర్ఎస్ వంటివి అందుబాటులో ఉంచుకోవాలని, తలపై టోపీ లేదా గొడుగు వంటివి వినియోగించాలని సూచిస్తున్నారు. డీహైడ్రేషన్, వడదెబ్బ తగలకుండా తాగునీరు, కొబ్బరినీళ్లు, గ్లూకోజ్, ఓఆర్ఎస్, మజ్జిగ, పండ్ల రసాలు వంటివి ఎక్కువగా తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు మరింత జాగ్రత్తలు వహించాలని, వడగాలులు, వేడి వాతావరణానికి దూరంగా ఉంచాలని వైద్యులు అంటున్నారు. ఎండ తీవ్రతకు తల తిరిగినా, నోరు పొడిబారిపోయినా, వడదెబ్బ తగిలినట్లు అనుమానం వచ్చినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. వేడి ఉపశమనంకోసం ఏసీలు, కూలర్లు, ఫ్యానులు వాడకం ఎక్కువైంది. జిల్లాలో సాధారణంగా 9 మిలియన్ యూనిట్లు వినియోగం ఉండగా ప్రస్తుతం 10.50 మిలియన్ యూనిట్లకు పెరిగినట్టు అధికారులు చెబుతున్నారు. మరికొన్ని రోజులు ఎండల తీవ్రత ఇదే ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తుండడంతో కరెంటు వాడకం మరింత పెరిగే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో బుధవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

	గరిష్టం	కనిష్టం
ఒంగోలు	43	31
మార్కాపురం	42	31
దర్శి	41	31
కనిగిరి	41	31
బేస్తవారిపేట	41	31
యర్రగొండపాలెం	41	31
సింగరాయకొండ	41	31
చీమకుర్తి	41	32



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెరుగుతున్న ఎండలు, వేడిగాలుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఉపాధి పనులకు వచ్చే ప్రజలకు ఓఆర్ఎస్‌లు ఇస్తున్నాం. ప్రజలు కూడా ఎండ తీవ్రత పెరగకముందే బయట పనులు చూసుకుని ఇళ్లకు చేరుకోవాలి. తిరిగి సాయంత్రం మాత్రమే బయటకు రావాలి. ఒకవేళ బయటకు రావల్సి వస్తే తగిన జాగ్రత్తలు పాటించి ఎండల నుంచి రక్షణ పొందాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు అందుబాటులో ఉంచుకుని బయటకు వస్తే వడదెబ్బ, డీహైడ్రేషన్ నుంచి రక్షణ పొందవచ్చు. ప్రభుత్వ యంత్రాంగం నుంచి ఎండ తీవ్రతకు ప్రజలకు రక్షణ కల్పించాల్సిన చర్యలు తీసుకున్నాం. ప్రజలు కూడా అవగాహనతో ముందస్తు జాగ్రత్తలు వహించాలి. దాతలు ముందుకొచ్చి రహదారుల వెంట చలివేంద్రాలు, వడగాల్పుల ఉపశమన కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వడదెబ్బలు తగిలినా ప్రజలను రక్షించేందుకు వైద్య ఆరోగ్య శాఖను అప్రమత్తం చేశాం. తగిన ఔషధాలు, ఇతర సౌకర్యాలతో సిద్ధంగా ఉంచాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్



ఉదయం 11 గంటల సమయంలో నిర్మానుష్యంగా మారిన ఒంగోలులోని చర్చి సెంటర్

కొండపి గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా

- కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండి సంయమనం పాటించండి
- 4వ తేదీ సంబరాలు జరుపుకుందాం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ:

కొండపి గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగరటం ఖాయమని జూన్ 4వ తేదీ సంబరాలు జరుపుకోవటమే తరువాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో అల్లర్లు జరిగాయని, కానీ కొండపి నియోజకవర్గంలో ఎన్నికలు సజావుగా సాగటంలో నాయకులు, కార్యకర్తలు చూపిన సంయమనం మరువలేనిదని కొనియాడారు. రాష్ట్రంతో పాటు కొండపి నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరగటం పార్టీ అభ్యర్థులకు కలిసొచ్చే అంశం అని చెప్పారు. ఈ ఎన్నికల్లో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారన్నారు. జిల్లా స్థాయిలో కొండపి నియోజకవర్గంలో మరే నియోజకవర్గంలో జరగని విధంగా మధ్యాహ్నం 12 గంటలకు 52 నుంచి 54 శాతం పోలింగ్ శాతం నమోదవటం శుభ పరిణామమన్నారు. అన్ని మండలాల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగిందని చెప్పారు. ఓటరు నాడి నాయకులు, కార్యకర్తలకే తెలుస్తుందన్నారు. అయితే ప్రతిపక్షం మాత్రం తాము గెలుస్తామని హడావుడి చేస్తోందని, పార్టీ నాయకులు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. మంచి సుపరిపాలన అందించిన ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీ ప్రజల్లో గుర్తింపు సాధించిందని, పార్టీ కేడర్ కూడా అభ్యర్థుల గెలుపునకు చిత్తశుద్ధితో పనిచేశారని ప్రశంసించారు. పోలింగ్ సమయంలో ప్రజల్లో ప్రభుత్వం పై సానుకూల ధోరణి కనబడిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు 160 సీట్లు గెలవటం ఖాయమన్నారు. కౌంటింగ్ రోజు గెలుపొందిన జాబితాలో ప్రకటించే మొదటి 50 స్థానాల్లో కొండపి ఒకటని మంత్రి సురేష్ ధీమా వ్యక్తం చేశారు. తాను అనారోగ్య కారణాల వలన కొద్దిరోజులు ప్రజలకు దూరంగా ఉన్నానన్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని, ఇక కౌంటింగ్ ప్రక్రియపై దృష్టి సారించాలన్నారు. కౌంటింగ్ సమయంలో ఏజెంట్లు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా సంయమనం పాటించి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి, పార్టీ ఎన్నికల పరిశీలకుడు రాచగర్ల పిచ్చయ్య యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, బత్తిన మదనమనోహర్‌రావు, దద్దాల మల్లికార్జునరావు, జేసీఎస్ కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, తాటికొండ రామచంద్రరావు, పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావ్, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మారెడ్డి వెంకటాద్రి, మాచేపల్లి నాగయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు 30 నాటికి పూర్తి చేయాలి



నియోజకవర్గ ఆర్ఓ, ఏఆర్ఓలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్



పాల్గొన్న రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు

- ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లు ఈ నెల 30వ తేదీ నాటికి ఎట్టి పరిస్థితిల్లో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి టేబుల్స్ ఏర్పాటు, బారికేట్లు, సీసీ టీవీ ఏర్పాట్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎన్నికల ఫలితాల డేటా నమోదు తదితర ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు వివరాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేయాలని క్రాస్‌చెక్ చేసే బృందం నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మార్గదర్శకాల మేరకు ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఓట్ల లెక్కింపు జరగాలన్నారు. కౌంటింగ్‌కు వచ్చే అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది వారి నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలకు సులభంగా వెళ్లేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించారు.

సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్ఓ శ్రీలత, ఒంగోలు, కొండపి, దర్శి, కనిగిరి, గిద్దలూరు, వైపాలెం నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సుబ్బారెడ్డి, కుమార్, లోకేశ్వరరావు, జాన్ ఇర్విన్, నాగజ్యోతి, శ్రీలేఖ, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వరరావు, డీటీసీ సుశీల, హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ దేవానందం ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపు ఫలితాలు సాయంత్రం 5 గంటలకు..

- కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్.దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్

ఒంగోలు సిటీ: ఓట్ల లెక్కింపు ఫలితాలను సాయంత్రం 5 గంటలకల్లా విడుదల చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్.దినేష్ కుమార్ చెప్పారు. కౌంటింగ్ నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై బుధవారం ఢిల్లీ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ కుమార్ వ్యాస్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్ నిర్వహణకు జిల్లా యంత్రాంగం చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ దినేష్‌కుమార్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ వేస్తున్నామని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కోసం పార్లమెంట్ నియోజకవర్గానికి 40, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఐదు చొప్పున టేబుల్స్ వేస్తున్నామని తెలిపారు. సాయంత్రం ఐదు గంటలకల్లా ఫలితాలు వెల్లడించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్ర ప్రాంగణానికి మూడంచెల భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజున హింసాత్మక ఘటనలపై నితీష్‌కుమార్ ఆరా తీయగా, ఈవీఎంల డ్యామేజీకి కారణమైన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా కౌంటింగ్‌కు చేపడుతున్న ఏర్పాట్లపై మార్కాపురం ఆర్వో రాహుల్‌మీనా, ఒంగోలు ఆర్వో జి.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్‌కు వివరించారు. జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, ఆర్వోలు పాల్గొన్నారు.

ఘర్షణలు జరగకుండా పటిష్టమైన చర్యలు

- గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి



మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: జూన్ 4వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపు తరువాత ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజీ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఒంగోలు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామాల తాజా పరిస్థితులు, పోలింగ్ రోజున జరిగిన సంఘటనలపై ఆరా తీశారు. ఆయా గ్రామాలను తరచుగా సందర్శించాలని, శాంతి భద్రతలు లోపించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలు, కాలనీల్లో సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని చెప్పారు. ఓట్ల లెక్కింపు రోజున సెక్షన్ 144 సీఆర్పీసీ అమలు చేయాలని, గ్రామాల్లో, కాలనీల్లోని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.చెక్ పోస్టుల వద్ద వాహనాలను తనిఖీ చేయాలని, ఎన్నికల కౌంటింగ్‌కు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

స్ట్రాంగ్ రూంను సందర్శించిన ఐజీ..

రైస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్‌తో కలిసి సందర్శించారు. అడిషనల్ ఎస్పీ (క్రైం) శ్రీధర్ రావు, అడిషనల్ ఎస్పీ రవి వర్మ (సీఐడీ), డీఎస్పీ యం.కిశోర్ బాబు, సీఐడీ డీఎస్పీలు సీహెచ్ వెంకటేశ్వరరావు, యం.మోహన్ రావు, ట్రైనీ డీఎస్పీ షేక్ షహబాజ్ , సీఐలు, ఎస్‌లు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లకు రక్షణ కరువు

- మద్యం తాగి ఘర్షణపడిన సెక్యూరిటీ
- బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు నిర్వహించిన ఎస్సై

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం ఆర్వో కార్యాలయంలో భద్రపరచిన పోస్టల్ బ్యాలెట్లకు రక్షణ కరువైంది. సెక్యూరిటీగా నియమించిన ఏఆర్ పోలీసులు మద్యం తాగి ఘర్షణకు దిగిన సంఘటన మంగళవారం రాత్రి జరగ్గా ఆలస్యంగా వెలుగుచూసింది. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు వృద్ధులతోపాటు ఎన్నికల విధులను నిర్వర్తించే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ఏర్పాటు చేశారు. పోలైన బ్యాలెట్‌లను ఆర్వో కార్యాలయంలో భద్రపరిచారు. వీటిని జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్‌కు ఒక రోజు ముందు ఒంగోలుకు తరలిస్తారు. అప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ బాక్సులను భద్రపరిచిన ఆర్వో కార్యాలయానికి భద్రతగా ఏఆర్ పోలీసులు, లోకల్ పోలీసులు 3 బ్యాచ్‌లుగా విధులు నిర్వర్తించాల్సి ఉంది. వీరిలో పోస్టల్ బ్యాలెట్ భద్రపరచిన గదికి సెక్యూరిటీగా ఉన్న ఏఆర్ పోలీసులు మద్యం తాగి అనునిత్యం గొడవకు దిగుతుంటారని ఆ ప్రాంతం వాసులు తెలిపారు. మంగళవారం రాత్రి వారు గొడవపడుతున్న సంఘటనను తెలుసుకున్న ఎస్సై సుదర్శన్ ఆర్వో కార్యాలయానికి వెళ్లారు. అక్కడ వారిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు నిర్వహించినట్లు తెలిసింది. వారిద్దరినీ విధుల నుంచి తప్పించి లోకల్ పోలీసులను సెక్యూరిటీగా నియమించారు. ఈ విషయం గురించి ఎస్సైను ప్రశ్నించగా రోజు వారి తనిఖీల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్‌లు భద్రపరచిన ఆర్వో కార్యాలయం వద్దకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఆలస్యంగా వచ్చిన సెక్యూరిటీ గార్డులను తొలగించి వారి స్థానంలో ఇతరులను ఏర్పాటు చేశామని, వారు మద్యం తాగి గొడవలకు దిగలేదని, వారిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు చేయలేదని ఆయన తెలిపారు. ఏడుగురు సెక్యూరిటీగా విధులు నిర్వర్తిస్తున్న వారిలో ఇద్దరు ఆలస్యంగా డ్యూటీకి వచ్చారని, వారిని విధుల నుంచి తప్పించడంలో మర్మమేమిటో అర్థం కావడంలేదు.

క్లుప్తంగా

పరీక్షలకు 11,797 మంది హాజరు

ఒంగోలు: ఇంటర్, పది పరీక్షలకు 11,797 మంది విద్యార్థులు హాజరయ్యారు. బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు 43 సెంటర్లు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 28 సెంటర్లు, పదో తరగతి పరీక్షలు 22 సెంటర్లలోను జరిగాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 8459 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 7709 మంది హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షకు 2810 మందికి గాను 2539 మంది హాజరయ్యారని ఆర్ఐఓ ఎ.సైమన్ విక్టర్ తెలిపారు. పదో తరగతి ఫిజిక్స్ పరీక్షకు సంబంధించి 2538 మంది విద్యార్థులకు గాను 1549మంది మాత్రమే హాజరయ్యారు. పరీక్షలు పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు తెలిపారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

● డ్వామా పీడీ అర్జున్‌రావు



మాట్లాడుతున్న డ్వామా పీడీ, ఏపీడీ

చీమకుర్తి: ఉపాధి కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ అర్జున్ రావు, ఏపీడీ వెంకటస్వామి తెలిపారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సంతనూతలపాడు, మద్దిపాడు, చీమకుర్తి మండలాల పరిధిలో పనిచేసే ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి కూలీలకు జీతం, రోజుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వేసవిలో పనిచేసే ప్రదేశంలో నీడ ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలని, మెడికల్ కిట్స్‌ను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఉపాధి పనుల్లో చెరువులు, కుంటలే కాకుండా రైతులకు ఉపయోగపడే ఫారంపాండ్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను పంపిస్తే మంజూరు చేయిస్తామన్నారు. ఉద్యానవన శాఖ కింద రైతులకు పండ్లతోటలను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు కల్పించామని పేర్కొన్నారు. అమృత్ సరోవర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేయటంతో పాటు రైతలుకు ఉపయోగపడే పనులను ఉపాధి పనులలో కల్పించేలా ప్రణాళికలను ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీఓ, ఏపీఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో బోల్తా 14 మందికి గాయాలు



కొండపి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న కూలీలు

కొండపి(సింగరాయకొండ): ఆటో బోల్తా పడి 14 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పెద్దకళ్లగుంట గ్రామంలో బుధవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...అనకర్లపూడి దళితవాడకు చెందిన కూలీలు మిరప కోతకు జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామానికి ఆటోలో బయలుదేరారు. ఆటో పెద్దకళ్లగుంట గ్రామం హైస్కూల్ సమీపంలోకి రాగానే పంది అడ్డు రాగా దాన్ని తప్పించే క్రమంలో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బోల్తా పడింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న కూలీలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను బయటకు తీసి మరో ఆటోలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. కూలీలకు స్వల్ప గాయాలు కావడంతో కుటుంబసభ్యులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

నేర్చుకుందాం రండి..!

స్మార్ట్ ఫోన్ ప్రపంచంలో ఆటపాటలు, క్రీడలు కనుమరుగైపోయాయి. అయితే మార్కాపురంలో మాత్రం వేసవిని ఆహ్లాదకరంగా మారుస్తూ వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 23 ఏళ్లుగా ఏటా వేసవిలో శిక్షణ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను వివిధ రంగాల్లో తీర్చిదిద్దుతున్నారు.

- విద్యార్థులకు వరంగా వేసవి శిక్షణ శిబిరాలు
- దాతల సహకారంతో 23 ఏళ్లుగా విద్యార్థులకు ఉచిత శిక్షణ
- క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



కర్రసాము శిక్షణలో విద్యార్థులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని పీఆర్ గెస్టు హౌస్ ప్రాంగణం మొత్తం వేసవిలో కోలాహలంగా ఉంటుంది. పట్టణంలోని కోడి రామ్మూర్తి నట శిక్షణ సంస్థ నిర్వాహకులు ఏటా వేసవిలో విద్యార్థులకు క్రీడలు, ఇతర విభాగాల్లో శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులను శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంచేలా వారిని తీర్చిదిద్దుతున్నారు. గత 23 సంవత్సరాలుగా నిర్విరామంగా సాగుతున్న ఈ శిక్షణకు దాతలు సహకరిస్తూ తమ వంతు తోడ్పాటు అందిస్తున్నారు. దీంతో ఈ శిక్షణ శిబిరాలకు తమ పిల్లలను పంపేందుకు తల్లిదండ్రులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే వేల మందికి శిక్షణ ఇచ్చారు.

ఉదయం 6 గంటల నుంచే...

సాధారణంగా సెలవులు వచ్చాయంటే ఎక్కువ శాతం మంది పిల్లలు గ్రౌండ్లు, మైదానాల్లో క్రికెట్ ఆడుతూ కనిపిస్తారు. కానీ మార్కాపురం పీఆర్ గెస్టుహౌస్ మైదానంలో మాత్రం ఆయా క్రీడల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనడం చూస్తాం. ఉదయం 6 గంటల నుంచే విద్యార్థులు గ్రౌండ్‌కు భారీగా చేరుకుంటారు. సాయంత్రం కూడా 4 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారు. ఏటా 30 రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహించేవారు. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో 20 రోజుల పాటు భరతనాట్యం, నటశిక్షణ, తదితర అంశాల్లో శిక్షణ ఇన్నారు. క్రీడలతో విద్యార్థి దశ నుంచే ఆలోచన శక్తి పెరగడంతో పాటు వారిలోని సృజనాత్మకత శక్తి బయటకు తీసేలా తర్ఫీదు ఇస్తున్నారు. శిక్షణకు వచ్చే విద్యార్థులకు దాతల సహకారంతో ఉదయం పూట అల్పాహారం అందిస్తున్నారు.



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



నటనలో శిక్షణ ఇస్తున్న నాగేశ్వరరావు



భరతనాట్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కర్రసాములో 50 మంది శిక్షణ



గ్రౌండ్‌లో ప్రతి రోజు 50 మంది విద్యార్థులకు కర్రసాములో శిక్షణ ఇస్తున్నా. ఈ నెల 10వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుంది. ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను శిక్షణకు తీసుకువచ్చేందుకు ఎంతో ఆసక్తి చూపించండం శుభపరిణామం.

– రాంబాబు, కర్రసాము

నటనలో శిక్షణ ఇస్తున్నా



నటనలో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి శిక్షణ ఇస్తున్నాం. వారిలో ఉన్న నైపుణ్యాలు పరిశీలించి వారికి ఆసక్తి ఉన్న క్యారక్టర్లలో శిక్షణ ఇస్తాం. ప్రతి రోజూ విద్యార్థులకు వేషధారణలో అలంకరించి హావభావాలను, సమయస్ఫూర్తిని నింపి సందర్భానుగుణంగా నటించేలా తీర్చిదిద్దుతాం.

– పిన్నిక నాగేశ్వరరావు, నట శిక్షకుడు

వివిధ అంశాల్లో శిక్షణ..

వేసవి శిక్షణా శిబిరానికి వచ్చే విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. బాక్సింగ్, ఫుట్‌బాల్, కర్రసాము, నటన, నాట్యం, తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో 120 మంది వరకు శిక్షణ పొందుతున్నారు. ప్రధాన కోచ్ అయిన కాళంగి శ్రీనివాసులు స్వతహాగా క్రీడాకారుడు అయినా పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ నటుడిగా రాణిస్తూ వేసవికాలంలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

ఎంతో ఉత్సాహంగా వస్తున్నారు



నాట్యంలో శిక్షణ పొందేందుకు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా రావడం సంతోషంగా ఉంది. గత 23 ఏళ్లుగా ఇటువంటి శిక్షణ శిబిరాలు నిర్వహించడం గొప్ప విషయం. విద్యార్థుల ఆసక్తిని బట్టి శిక్షణ ఇస్తున్నాం. 20 రోజుల పాటు జరిగే శిక్షణలో విద్యార్థులు ఉదయం, సాయంత్రం పాల్గొంటున్నారు.

– లక్ష్మీ ప్రియాంక, భరతనాట్య శిక్షకురాలు

క్రీడలతో విద్యార్థుల్లో ఐక్యత



తల్లిదండ్రులు కంప్యూటర్ విద్యతో పాటు, వేసవి శిక్షణ శిబిరానికి మా దగ్గరకు తీసుకుని రావడం ఆనందంగా ఉంది. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, ఆలోచన శక్తి పెరుగుతుంది. శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారు. కంప్యూటర్ తరగతులంటూ పిల్లలను తల్లిదండ్రులు ఇంటికే పరిమితం చేయకుండా ఇలాంటి శిక్షణ శిబిరాలకు తీసుకురావటం చాలా సంతోషంగా ఉంది. గత 23 ఏళ్లుగా దాతల సహకారంతో నిర్వహిస్తున్నాం. కొన్ని వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చాం. చాలా ఆనందంగా ఉంది.

– కాళంగి శ్రీనివాసులు, సంస్థ కార్యదర్శి, ప్రధాన కోచ్

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



హాజరైన పార్టీల నాయకులు

ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు
- చట్టవ్యతిరేక చర్యలు, రెచ్చగొట్టే వీడియోలు పోస్టు చేస్తే సహించం
- గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి
- ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

కనిగిరి రూరల్: ఎన్నికల నియమ నిబంధనావళిని ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని.. కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. స్థానిక పవిత్రా కళ్యాణ మండపంలో కనిగిరి పోలీస్ డివిజన్‌లోని 9 మండలాలకు చెందిన ఇరు పార్టీల నాయకులతో ఎన్నికల కౌంటింగ్, తదుపరి పరిణామాలపై బుధవారం అవగాహన సదస్సు డీఎస్పీ రత్నాకరం రామారాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ముగిసిన తర్వాత కూడా ప్రతి గ్రామంలో ప్రశాంత, శాంతియుత వాతావరణం ఉండాలన్నదే లక్ష్యమని తెలిపారు. బైండోవర్ చేసిన తర్వాత కూడా కొందరు దర్శి, పాలెం ఏరియాల్లో సుమారు 50 మంది అల్లర్లు, గొడవల్లో పాల్గొన్నారని, వారికి రూ.లక్ష వరకు జరిమానా విధించినట్లు, జరిమానా చెల్లించకుంటే షూరిటీ ఉన్న వారు చెల్లించాల్సి ఉంటుందని, వారు చెల్లించకుంటే జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని వివరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపించినా, బయట వ్యక్తులు వచ్చి గొడవలకు దిగినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలోని ప్రతి నాయకుడు ఎస్సై, సీఐ, డీఎస్పీల ఫోన్ నంబర్లు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్లు ముందుగానే ఐడీ కార్డు తీసుకొని కేంద్రాలకు రావాలన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఐడీ కార్డు ఇస్తామంటే వినవద్దని, సుమారు 2 కిలోమీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేస్తామని స్పష్టం చేశారు. కౌంటింగ్ ముగిసిన తరువాత బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం నిషేధమని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ దుకాణాల్లో విడిగా బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ పోయవద్దని సంబంధిత డీలర్లకు నోటీసులిచ్చామని, క్రాకర్స్ దుకాణ, లైసెన్స్ దారులకు కూడా ఇప్పటికే తగిన హెచ్చరికలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. కొంత మంది అసాంఘిక శక్తులు పార్టీలు, కులాలు, మతాలను రెచ్చగొట్టేలా వీడియోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాల్లో షేర్ చేస్తున్నారని, వాటిని స్పందించవద్దని తెలిపారు. కొంత మంది టెక్నాలజీని ఉపయోగించి ఎక్కడో జరిగిన వీడియోలను మన ప్రాంతంలో జరిగినట్లు గ్రూపుల్లో షేర్ చేసి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడతారని, ఇలాంటి విషయాల్లో గ్రూప్ అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలని లేకుంటే వారిని బాధ్యులుగా చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లెక్కింపు తర్వాత కూడా జిల్లాలో సెక్షన్ 144 అమల్లో ఉంటుందన్నారు. ఆర్వో పర్మిషన్ తీసుకున్న తర్వాతే ర్యాలీలకు అనుమతి ఉంటుందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కనిగిరి డివిజన్‌లో సీఎస్‌పురం, వెలిగండ్లలో చిన్న చిన్న ఘటనలు తప్ప ఎలాంటి గొడవలు లేవన్నారు. ఎగ్జిట్ పోల్స్ వచ్చిన తర్వాత అయినా, లెక్కింపు తర్వాత అయినా ఎలాంటి ఘటనలు జరగకుండా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంయమనం పాటించాలన్నారు. ఎక్కడ ఏ చిన్న సమస్య జరుగుతున్నట్లు తెలిసినా, రెచ్చగొట్టే కార్యక్రమాలకు పూనుకుంటున్నా..వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందిస్తే తక్షణం స్పందించి సహకారం అందించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరుపార్టీల రాజకీయ నాయకులు శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో పోలీస్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

అశ్వ వాహనంపై వేణుగోపాలుడు



అశ్వ వాహనంపై దర్శనం ఇస్తున్న వేణుగోపాల స్వామి

యర్రగొండపాలెం: స్థానిక మిల్లంపల్లి రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి అశ్వ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

దాడి కేసులో ఒకరు అరెస్టు

- పాత గొడవలే దాడికి కారణం
- డీఎస్పీ రత్నాకరం రామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రత్నాకరం రామరాజు

కనిగిరి రూరల్: వెలిగండ్ల మండలం జంగంనర్సాయపల్లి ఎస్సీ కాలనీకి చెందిన తీట్ల నారాయణ ఇంటిపై బీరు సీసాలో పెట్రోలు నింపి దాడి చేసిన ఘటనలో ఒకరిని అరెస్టు చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని కనిగిరి డీఎస్పీ రత్నాకరం రామరాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. కటుకూరి అనంతబాల అలియాస్ దూదేకుల రజాక్‌కు, అదే గ్రామానికి చెందిన తీట్ల నారాయణకు 2020 కోవిడ్ సమయంలో ఇద్దరి మధ్యలో మనస్పర్థలు ఉన్నాయి. దీంతో అప్పటి నుంచి ఇద్దరి మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నిందితుడు కె.అనంతబాల, మరొకరు కటుకూరి రహీంలు కలిసి ఈనెల 28 అర్ధరాత్రి దాటిన తర్వాత బీరు సీసాలో పెట్రోలు నింపి ఇంటిపైకి విసిరారు. బీరు సీసా గేటుకు తగిలి బయట ఉన్న వాహనానికి తగిలి మంటలురేగాయి. వెంటనే తీట్ల నారాయణ కుటుంబ సభ్యులు మేలుకొని మంటలను అదుపు చేశారు. ఈ మేరకు బాధితుడు తీట్ల నారాయణ తన ఇంటిపైకి గుర్తుతెలియని దుండగులు దాడి చేశారని, తాము మేల్కొని మంటలు అదుపుచేయకుంటే ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్పీ ఆదేశాల మేరకు కనిగిరి డీఎస్పీ ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మండలంలోని నాగులవరం జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం 5 గంటలకు అనుమానంగా సంచరిస్తున్న కె.అనంతబాలను పట్టుకొని మధ్యవర్తుల సమక్షంలో విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు. రెండో నిందితుడు పరారీలో ఉన్నాడని, అతన్ని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు. కేసును త్వరితగతిన ఛేదించిన పామూరు సర్కిల్ అధికారులను, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

1న రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు

రాచర్ల: వేమయ్యస్వామి 262వ ఆరాధన మహోత్సవం సందర్భంగా జూన్ 1వ తేదీ శనివారం చోళ్లవీడులో రాష్ట్రస్థాయి ఎడ్లపందేలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు జూన్ 1వ తేదీ లోగా రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.40, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20వేలు, నాల్గవ బహుమతి రూ.15వేలు, ఐదో బహుమతి రూ.10వేలు, ఆరో బహుమతిగా రూ.8వేలు, ఏడో బహుమతిగా రూ.5వేలు, ఎనిమిదవ బహుమతిగా రూ.4 వేలు అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9912032442, 9912995159 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గర్భిణుల వివరాలు నమోదు చేయాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాన్పు అయిన మహిళలకు ఆరోగ్య ఆసరా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.8 వేలు అందజేస్తుందని, కనుక పీహెచ్‌సీ కాన్పు చేసుకున్న గర్భిణుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లతో ఆరోగ్య ఆసరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాన్పు కోసం వచ్చిన ప్రతి గర్భిణీ వివరాలను తొలుత రిజిస్టర్ పుస్తకంలో నమోదు చేసి కాన్పు తరువాత ఆన్‌లైన్ చేయాలని సూచించారు. తల్లి ఆధార్ కార్డు నంబర్, బ్యాంకు ఖాతా వివరాలు, ఎంసీపీ కార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన 24 రోజుల లోగా ఆరోగ్య ఆసరాకు సంబంధించిన రూ.8 వేలు జమవుతాయని తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు గ్రేడింగ్



పోస్టల్ బ్యాలెట్ ఓట్లను గ్రేడింగ్ చేస్తున్న అధికారులు

ఒంగోలు సిటీ: ఒంగోలు అసెంబ్లీ పరిధిలోని పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 4,648, అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 5,335 గ్రేడింగ్ చేసినట్లు ఒంగోలు నియోజకవర్గ ఆర్వో జీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఒంగోలు ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించిన పార్లమెంట్, అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల గ్రేడింగ్ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నియోజకవర్గ ఆర్వో సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఒంగోలు అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 5,327, సర్వీస్ 8 కలిపి మొత్తం 5,335 ఓట్లు, పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 4648 ఉన్నాయన్నారు. గ్రేడింగ్ చేసిన పార్లమెంట్, అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను జూన్ 3వ తేదీన రైజ్ కాలేజీ లెక్కింపు కేంద్రానికి చేరుస్తారని తెలిపారు. అలాగే జిల్లాలోని మిగిలిన ఏడు నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పార్లమెంట్, అసెంబ్లీ ఓట్లను గ్రేడ్ చేసి జూన్ 3వ తేదీన రైజ్ కాలేజీకి చేరుస్తామని తెలిపారు. గ్రేడింగ్ చేసిన ఓట్లను విడివిడిగా బాక్సులలో పెట్టి స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు, కొత్తపట్నం తహశీల్దార్లు పసుపులేటి హేమంత్, అర్జున్‌రెడ్డి, ఏఓ చిన్నికృష్ణ, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, రసూల్, గుర్రం సత్యం, అభ్యర్థులు సుందరం, హుస్సేన్‌బీ, స్వరూప్, శంకర్‌రెడ్డి, రవీంద్ర, యోగానంద్, చైతన్యప్రసాద్, అనీల్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.